క్లుప్తంగా

తుపాను ప్రభావంతో వర్షం

మాచర్ల: పట్టణంలో మిచాంగ్ తుపాను ప్రభావం నేపథ్యంలో వర్షం కురుస్తుంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు చిరుజల్లులతో వర్షం కురిసింది. 7.30 గంటల తరువాత వర్షం కొంత మేర పెరిగింది. వర్షం నేపథ్యంలో ఆయా పంటలకు సంబంధించిన రైతులు ఇబ్బంది పడే పరిస్థితి లేదు. రోజూ ఇదే విధంగా వర్షం కొనసాగితే పత్తి, మిరప రైతులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైతే రైతులకు ఇబ్బంది లేదు. కావున ప్రజలంతా తుపాను ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా అప్రమత్తంగా ఉండాలని ఆయా శాఖాధికారులు సూచించారు.

పిడుగురాళ్లలో ఓ మోస్తరు వర్షం

పిడుగురాళ్లరూరల్: పిడుగురాళ్ల పట్టణంలో ఉదయం 11 గంటల నుంచి ఓ మోస్తారు వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. అదేవిధంగా పట్టణ శివారు కాలనీలోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. రైతులు పంట పొలాల్లో పరదాలు కప్పి పంటను కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఈ వర్షం కొన్ని పంటలకు వరంగా ఉంటే, మరి కొన్ని పంటలకు నష్టం కలిగించవచ్చునని రైతులు తెలియజేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పిడుగురాళ్ల పట్టణం, మండలంలోని విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ డీఈ బాజ్జీనాయక్ తెలియజేశారు. విద్యుత్ తీగలు తెగినా, కరెంట్ స్తంబాలు పడిపోయినా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.

అన్నదానం



విజయపురిసౌత్: మాచర్ల మండల పరిషత్ అధ్యక్షురాలు బూడిద మంగమ్మ తనయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో మాలాధారులకు అన్నదానం నిర్వహించారు. సోమవారం కార్తీకమాసాన్ని పురస్కరించుకొని విజయపురి సౌత్ లాంచీ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ తనయుడు బూడిద శ్రీనివాసరావు, జిల్లా గొర్రెల పెంపకం దార్ల అధ్యక్షుడు బూడిద సైదులు భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అయ్యప్పస్వామి, శ్రీకృష్ణ దేవాలయాలలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది అన్నదానానికి తరలి వచ్చారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన



ముప్పాళ్ళ: వేసక్టమీ ఆపరేషన్ పక్షోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన ముప్పాళ్ళలో పురుషులకు కుటుంబ నియంత్రణ పద్ధతిపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజరు సీ ఆంజనేయులు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పాటించటంలో మహిళలతో పాటుగా పురుషులు భాగస్వాములు కావచ్చన్నారు. ఈ విధానంపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అనంతలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజరు ఏ పీటర్‌డానియేన్, ఏఎన్ఎం జి.జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేత

క్రోసూరు: తుపాను కారణంగా దూళ్లిపాళ్లలోని విజయ ఎంటర్‌ప్రైజర్స్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి సోమవారం తెలిపారు. వర్షాలు తగ్గిన తరువాత కొనుగోళ్ల పునఃప్రారంభ తేదీని తెలియపరచగలమని చెప్పారు.

రేపు అబ్దుల్లా బాషా బాబా ఉరుసు

చిలకలూరిపేట: మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న హజరత్ మౌలానా మౌల్వి మొహమ్మద్ అబ్దుల్లాబాషా బాబా 72వ ఉరుసు మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. మౌలానా మౌల్వి మొహమ్మద్ అబ్దుల్లా బాషా తమిళనాడు రాష్ట్రంలోని రాయవేలూరులో జన్మించారు. ఆయన బాకియాతుష్ సలాక్ కళాశాల నుంచి ధార్మిక విద్యలో మౌల్వి పట్టా పొందారు. మారిఫత్ నయీ గజల్ అనే పుస్తకం రాయడం ద్వారా ఉర్దూ కవుల నుంచి ఖాదరిష్య జలియా బిరుదు పొందారు. 40 ఏళ్ల వయసులో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అనంతరం పోతవరం గ్రామానికి చేరుకొని గ్రామస్తులకు ఆధ్యాత్మిక భావం, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేవారు. గ్రామంలో మసీదు నిర్మించి నమాజ్ చేయించేవారు. వనమూలికలతో కులమతాలకు అతీతంగా ఉచితంగా వైద్యం అందించేవారు. అబ్దుల్లా బాషా బాబా ఆయన శిష్యులకు తాను 1953వ సంవత్సరం రబ్బీలవల్ మాసంలో శనివారం తుది శ్వాస విడుస్తానని చెప్పారు. అదే సమయంలో తుది శ్వాస విడిచారు. అప్పటి నుంచి ప్రతి ఏటా రబ్బీలవల్‌లో ఆయన ఉరుసుమహోత్సవం నిర్వహిస్తున్నారు. ఆరో తేదీ ఉరుసు, ఏడున దీపారాధన, అన్నదానం నిర్వహించనున్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



జెట్టిపాలెంలో లబ్ధిబోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి, పార్టీ నేతలు

జెట్టిపాలెం(రెంటచింతల): ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చినమాట తప్పని జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. సోమవారం రాష్ట్రానికి జగన్ అవసరం ఎందుకు కార్యక్రమంలో భాగంగా జెట్టిపాలెం గ్రామ సచివాలయం పరిధిలో ఆమె పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వలంటీర్లు నాయకులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాలతో ఎంత మేలు జరిగిందో వివరించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో సీఎం జగన్ 99.5 శాతం అమలుచేసి ప్రజల ఆర్థికాభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డి.ఉదయకుమారిరమేష్, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మేకపోతుల బూర్రెడ్డి, జే మంగ్లానాయక్, పార్టీ నాయకులు మేకపోతుల శివారెడ్డి, కుందురు పేర్రెడ్డి, పేరువాల కోటయ్య, దేరంగుల గురవయ్య, మున్నా అమలయ్య, దేరంగుల ఆంజనేయులు, దావులూరి ఏసోబు పాల్గొన్నారు.

99 శాతం హామీలు నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్

కారెంపూడి: ఎన్నికల్లో ఇచ్చిన 99 శాతం హామీలు నెరవేర్చి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదవారి జీవన ప్రమాణాలు పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం పట్ల భాధ్యతగా వ్యవహరించారని జేసీఎస్ మండల కోఆర్డినేటర్ ఆల్లు వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో సోమవారం రాత్రి చిరుజల్లులు పడుతున్నా ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో పార్టీ జెండాను, అభివృద్ధి, సంక్షేమ పథకాల బోర్డును గ్రామ సర్పంచ్ జెడ్డా కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ బొమ్మిన అల్లయ్యసావిత్రితో కలసి వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. అనంతరం ఎస్సీ కాలనీలో 15 గడపలకు వెళ్లి ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు.



మోర్జంపాడులో కరపత్రాలు అందజేస్తున్న మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి



చినకొదమగుండ్లలో అభివృద్ధి, సంక్షేమబోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

రాష్ట్రానికి ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబునాయుడు ఎన్నడూ కూడా పేదల గురించి ఆలోచన చేయలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల విద్య, వైద్యం వారి ఆర్థికాభివృద్ధి గురించి ఆలోచన చేసి వారి సంక్షేమానికి తగిన చర్యలు తీసుకున్నారని వివరించారు. ప్రజలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు తెలుపుతామన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘వై ఏపీ నీడ్స్ జగన్’



మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా చేపట్టారు. ఆయా గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. నాలున్నర ఏళ్లలో జగన్ ప్రభుత్వం, గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, నవరత్నాలు, సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుంటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ, ప్రభుత్వం చేసిన మంచి పనులు తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే మరలా ఏపీకి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలంటూ తెలియజేశారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిరు జల్లుల వల్ల పంటలకు నష్టం లేదు

మండల వ్యవసాయ శాఖ అధికారి యలమందారెడ్డి



కోత దశలో ఉన్న వరి పంట

కారెంపూడి: ప్రస్తుతం పడుతున్న తేలిక పాటి జల్లుల వల్ల పంటలకు నష్టం లేదని ఇంకా బాగా పడితే పొలాలు పదును అవుతాయని మెట్ట పంటలకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి సోమవారం తెలిపారు. పెద్ద వర్షం పడితే పంటలకు పదును ఈ నెలాఖరు వరకు ఉంటుందని మెట్ట పంటలకు చాలా ఉపయోగమన్నారు. మండలంలో వేసిన 2,200 ఎకరాలలో వేసిన మిర్చి పంట ప్రస్తుతం పూత దశలోనే ఉందని వర్షం వల్ల మిర్చికి నష్టం జరగదన్నారు. కాయ దశలో ఉన్నా పెద్ద వర్షం అయితే కాయకుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉంటే సోమవారం కారెంపూడి మండలంలో చిరు జల్లులే పడ్డాయి. వర్షం మాత్రం పెద్దగా పడలేదు. ఇప్పటికి పంటలకు నష్టం లేదని ఇంకా బాగా పడితే వర్షాధార పంటలకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

నూతనంగా 230 దరఖాస్తులు

మున్సిపల్ కమిషనర్ రమణబాబు



మాచర్ల: పట్టణంలోని 31 వార్డులలో 46 కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఓటు నమోదు కేంద్రాలలో 230 మంది నూతన ఓట్లకు దరఖాస్తు చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు తెలిపారు. శని, ఆదివారాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 46 కేంద్రాలలో 230 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదే విధంగా చేర్పులు, మార్పులపై పలు దరఖాస్తులందాయన్నారు. పరిశీలించి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించటంతో పాటు సవరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రూ.80లక్షలతో కోటప్పకొండ అభివృద్ధి పనులు



కోటప్పకొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కోటప్పకొండపై మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోటప్పకొండలో దాదాపు రూ.80లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటప్పకొండ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్టు తెలిపారు. కొండపై అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదానాన్ని ఆలయంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం చిలకలూరిపేటకు చెందిన దాతలు తేళ్ల సుధీర్, శ్రీధర్ సహకారంతో నిత్యాన్నదాన మండపాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. అలాగే నూతనంగా వంటశాల, వసతి గదులు, లిఫ్ట్‌తో పాటు పలు నిర్మాణాలను చేపడుతున్నట్టు వివరించారు. మహాశివరాత్రి రోజున నిర్వహించే తిరునాళ్లకు ఆయా పనులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, ఆలయ ఈఓ గొలమూరి శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మట్లా లింగారెడ్డి, వంపుగుడి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ట్యాబ్‌లు



శావల్యాపురం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత సెంటరులో విభిన్నా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులను చిన్న చూపు చూడకుడదని, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసి గొప్పవారిని చేయాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన ఇద్దరు విద్యార్థినులకు సమగ్ర శిక్ష అభియాన్ సౌర్యంలో ఒక్కోటి రూ. 28 వేల విలువ చేసే ట్యాబ్‌లు అందజేసినట్లు చెప్పారు. భవిత సెంటరులో చేరిన ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు వినికిడి పరికరాలు, వీల్‌చైర్లు తదితరవన్నీ ప్రభుత్వమే ఉచితంగా మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పుసులూరి లలితా కుమారి, భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

సత్తెనపల్లి: నరసరావుపేట డీఎస్సీ స్టేడియంలోని ఇండోర్‌హాల్‌లో ఈ నెల 3న ఆర్.బి.డ్రాగన్స్ షాటోకాన్ కరాటే దు-ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పల్నాడు జిల్లా స్థాయి కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ పోటీలకు జిల్లాలోని నలుమూలల నుంచి 256 మంది బాలబాలికలు హాజరయ్యారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సాయిరాం, రవికుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు మంచి ప్రతిభతో బాలికల విభాగంలో యస్.లిఖిత గోల్డ్ మెడల్ సాధించగా, టి.శివశ్రీ, ఎ.మాధురి సిల్వర్ మెడల్ సాధించారు. బాలుర విభాగంలో టి.జీవన్, జి.మహేష్, ఎం.సాయి, జి.సాత్విక్, ఎస్.షణ్ముక్ గోల్డ్ మెడల్ సాధించగా, ఎం.శ్రీహర్ష, ఎం.సాయి ప్రణవ్ సిల్వర్ మెడల్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌లను సోమవారం పట్టణంలో పలువురు అభినందించారు.

నాగసరపు రామారావుకు ఘననివాళి



నరసరావుపేట ఈస్ట్: ఆధ్యాత్మిక, విద్య, సేవారంగాల్లో నాగసరపు రామారావు సేవలు అందరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో సోమవారం కళాశాల మాజీ కార్యదర్శి నాగసరపు రామారావు 11వ సంస్మరణ సభ నిర్వహించారు. రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కళాశాల కార్యదర్శిగా 55 సంవత్సరాల పాటు సేవలు అందించి పల్నాడు ప్రాంతంలో విద్యా ప్రదాతగా రామారావు సేవలు అందించారని తెలిపారు. అలాగే పట్టాభిరామస్వామి ఆలయ ధర్మకర్తగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవారంగంలో గణనీయమైన సేవలు అందించారని కొనియాడారు. రామారావు అందించిన సేవలకు గుర్తుగా ఇందిరాప్రియదర్శిని అవార్డుతోపాటు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారంతో గౌరవించారని తెలిపారు. సంస్మరణ సభకు రామారావు కుమారుడు, కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయ గుప్త అధ్యక్షత వహించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, రామారావు మనుమలు రూపేష్ గుప్త, రాందేవ్ గుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ వైఫల్యాలను ఎండగట్టడమే సీపీఎం లక్ష్యం

నరసరావుపేట: దేశంలో పెరుగుతున్న మతోన్మాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలంటే బీజేపీని ఓడించడం ద్వారానే సాధ్యమని, మోదీని ఓడించండి అనే నినాదంతో తమ పార్టీ నిత్యం ప్రజల్లో ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య అన్నారు. సోమవారం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు జిల్లా కేంద్రంలో పార్టీ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాలలో బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం చూస్తే మతోన్మాద ప్రమాదం ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమైందన్నారు. ఆ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి దాని వలన దేశానికి, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులకు కలిగే నష్టాలను వివరిస్తూ ఆ పార్టీ విధానాలను ఎండగట్టడమే పనిగా పెట్టుకొని తమ పార్టీ నిత్యం ప్రజల్లో ఉంటుందన్నారు. నిత్యం ప్రజలను చైతన్యం చేస్తున్న తమ పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, వై.రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, జి.మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా విశ్వబ్రాహ్మణుల కార్తీక వన సమారాధన

పాల్గొన్న మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్



విశ్వబ్రాహ్మణ కార్తీక సమారాధనలో మాట్లాడుతున్న పీవీఆర్

మాచర్ల: కార్తీక వన సమారాధన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తన అన్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. సంఘం అధ్యక్షులు కటకం నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావుల ఆధ్వర్యంలో మానుకొండ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు జరిపి వేలాది మందికి అన్నదాన కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి మేడవరపు రంగనాయకులు, కటకం వెంకటాచారి, చెన్నుపల్లి రాంబాబు, తాళ్ళూరి మోహన్‌బాబు, సి.రామదాసు, వి.కోటాచారి, నాగబ్రహ్మాచారి, మంగళగిరి శ్యాంసుందరాచారి, బి.జగన్నాధాచార్యులు, సైదయ్య చారి, శివాచారి తదితరులున్నారు.

ఘనంగా రోశయ్య మూడవ వర్ధంతి



మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

మాచర్ల: ఉమ్మడి మాజీ ముఖ్యమంత్రి, గవర్నర్, అజాతశత్రువు, వాగ్ధాటి పటిమ కలిగిన కొణిజేటి రోశయ్య మూడవ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని రోశయ్య విగ్రహానికి పలువురు ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు మాట్లాడుతూ రోశయ్య రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. గణాంకాలలో దిట్ట అని, బడ్జెట్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరించే రోశయ్య సేవలు మరువలేనివని మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పోలా శ్రీనివాసరావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 16సార్లు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకే దక్కిందన్నారు. పార్టీలకతీతంగా పనిచేస్తూ అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వాసవి సేవా సమితుల సలహా మండలి సభ్యులు చిల్లంచర్ల సత్యనారాయణ, మారం ప్రసాద్, వాసు, రంగా చెన్నయ్య, కొత్తమాసు సుబ్బారావు, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ట్రస్టు బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, కజ్జం సైదయ్య, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, ఓబులశెట్టి నాగేశ్వరరావు, మాజీ ఎరువుల అసోసియేషన్ అధ్యక్షులు చుండూరు శ్రీను, సుబ్బారావు, కంభంపాటి అనిల్‌కుమార్, సైదారావు, అమర్, అంజి, శ్రీను, కొత్త శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రోశయ్యకు సిండికేట్ ఘన నివాళి..

పట్టణంలోని సిండికేట్ నాగేశ్వరరావు, ఆర్యవైశ్య నాయకుడు అనేక సంవత్సరాలుగా స్వయంగా రోశయ్య పేరు మీద చేతి సంచులు తయారు చేయించి పంపిణీని ఆనవాయితీగా చేస్తున్నారు. సోమవారం రోశయ్య మూడవ వర్ధంతిని నాగార్జున కళామందిర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తహసీల్దార్ పుల్లారావు



రెంటచింతల: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రస్తుతం మరింత బలపడి తుపాన్‌గా మారిన నేపథ్యంలో కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుపాన్ కారణంగా రానున్న రెండు, మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలకు పాతకాలం నాటి శిథిలావస్థలో ఉన్న మట్టిమిద్దెల గోడలు పడిపోయే ప్రమాదం ఉన్నందున అలాంటి చోట నివసించేవారు వెంటనే ఇల్లు విడిచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. గ్రామ పరిసరాలలో పొంగుతున్న వాగులు, కుంటల వద్దకు చిన్న పిల్లలను వెళ్లకుండా చూడాలన్నారు. పొలాల్లో విద్యుత్ మోటర్లు ఆన్ చేసే సమయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామాలలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆయా గ్రామాల వీఆర్వోలకు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఏమైనా అనూహ్య ఘటనలు జరిగిన వెంటనే తహసీల్దార్ కార్యాలయం నంబర్ 9959110777కు తెలియపరచాలని కోరారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించండి



మిర్చి రైతులకు సూచనలు అందజేస్తున్న హార్టికల్చర్ అధికారి సురేష్

మాచర్ల రూరల్: తుపాను నేపథ్యంలో మిర్చి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులను సాధించి నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారి ఎస్.సురేష్ అన్నారు. తుపాను నేపథ్యంలో సోమవారం మండలంలోని రాయవరం, కొత్తపల్లి, కొప్పునూరు, కంభంపాడు గ్రామాలలో రైతులతో ఆయన మాట్లాడారు. పొలంలో నిలిచిన నీటిని బయటకు పంపి వర్షాలు ఆగిన వెంటనే 19:19:19, 13:00:45 యూరియా వంటి పోషకాలు పంటపై పిచికారీ చేయాలి. కలుపు మొక్కలు తొలగించి నేల త్వరగా ఆరేలా చూడాలి. నీరు నిలవ వలన ఎండు తెగులు వచ్చే అవకాశముంది. ఉష్ణోగ్రతలు తగ్గటం వలన ఆకుమచ్చ, బూడిద తెగులు వచ్చే అవకాశముంది. ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

దంపతులపై బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: దంపతులపై బ్లేడుతో దాడి చేసిన వ్యక్తిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణబాబు కాలనీలో నివాసం ఉండే మల్లేశ్వరరావు, భవానీ దంపతులు ఆదివారం ఇంట్లో నిద్రిస్తుండగా, పాత కక్షల నేపథ్యంలో పాతస్ ముగ్ధం బలవంతంగా తలుపులు పగులగొట్టి లోపలకు ప్రవేశించాడు. ఎదురుగా వస్తున్న దంపతులపై బ్లేడుతో దాడిచేసి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకుల వారితోటలో నివాసం ఉండే కె.కవిత బీటెక్ పూర్తి చేసింది. గత సంవత్సరం మల్లికార్జునపేటకు చెందిన మురళి ఆమెకు పరిచమయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. దీనికి కవిత రూ. 2.30 లక్షలు చెల్లించింది. మురళి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేయడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్ 10వ లైనుకు చెందిన చింతలపూడి శ్రీనివాసరావు (50) పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2021లో బ్యాంకు రుణం తీసుకుని బాలాజీనగర్ 10వ లైనులో నివాసాన్ని కొనుగోలు చేశారు. దీనితో పాటు పలు క్రెడిట్ కార్డుల అప్పులున్నాయి. వాటిని తీర్చలేకపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు అప్పులు రూ. 25లక్షలపైనే ఉంటాయని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య స్వరాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహాకాళేశ్వరుడిగా మల్లికార్జునస్వామి దర్శనం

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున దేవస్థానంలో కార్తిక సోమవారం సందర్భంగా స్వామి ఉజ్జయిని శ్రీమహాకాళేశ్వరునిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామికి కపాలధారిగా, శ్మశాన రుద్రునిగా విశేష అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక హారతులు ఇచ్చారు.